# లేఖ

## ౨

శ్రీమతి సి. వి. రమణమ్మగారు

కమలకు:—

నాపుట్టినరోజు పండుగకు కానుకగా నీల ఏంపంపిందో తెలుసా? తనూ తనపిల్లలు సంక్రాంతిరోజులలో బొమ్మలపండుగకు తన దగ్గిరనున్న బొమ్మలన్నీ పెట్టుకొని వాటి ప్రక్కవాళ్లంతా నిలవబడిదిగిన ఫోటోన్నూ, నాలుగు క్యాలండరు బొమ్మలున్నూ. పైగా 'కళాభాయి అయిన నాసీకు చూపించు ఆనందించుతాడు' అని వ్రాసింది. నాసి అవి చూచి ఎంత విచారపడ్డాడనుకున్నావ్! కన్నీళ్లపర్యంతం అయిందతనికి. నేను నిర్ఘాంతపోయి అతనివైపు అర్థంలేని చూపులు చూస్తూ నిలబడ్డాను. బొంగురువోయిన గొంతును సవరించుకుంటూ "ఉయ్యాలలూపుతూ ఆనందధామాన్ని అధివసింపజేసే మాతృహస్తమే కొంకరలుపోతే ఇకలోకానికి మిగిలేది ఏడుపులు పెడబొబ్బలు మాత్రమే!" అన్నాడతను. చలనంలేని ఆనాటి అతని దృష్టి అశ్రువులతో నిండిన అతని వేదాంతచక్షువులు చూస్తే, పైకిలేచే మంటల్ని జీర్ణింపజేసికొనే అతని హృదయం అర్థంఅయ్యేది లోకానికి.

సంక్రాంతిపుణ్యదినాల్లో ఎలాంటిబొమ్మలు నీల గృహాన్ని అలంకరించాయి అని అనుకుంటున్నావ్! కళావైదగ్ధ్యమూ జీవవిన్యాసమూ లేని, యంత్రముమీద తయారయిన జపాను 'పింగాణీసరుకు'. అసలే కోమలంగా జీవంతో కిళకిళలాడే వనాల్లో ఆకులమధ్య పూరిగుడిసెల్లో పెరిగే బాలబాలికల్ని భవనాలని పేరుపెట్టి అచంచలమైన రాళ్లల్లో రప్పల్లో పెంచుతున్నాం; అలావాటిల్లోఉండే కాఠిన్యాన్ని కూడా వాళ్ల హృదయాలకు ఆపాదింపచేస్తున్నాం; ప్రకృతికి దూరంచేసి మానవప్రకృతికే దూరం చేసేస్తున్నాం వాళ్లను. ఇది చాలకుండా జీవం కళాలేని బొమ్మలమధ్య పెంచి వాళ్ల దృష్టిని నాశనం చేసెయ్యాలా? ఆత్మవిన్యాసం ఆత్మవికాసం ఏమీలేని బొమ్మలమధ్య వస్తువనుకరణం కూడా సరిగాలేక ఏవో కళ్లను చెదరగొట్టే రంగులనుపూసిన చిన్ని శవాలమధ్య పెంచుతుంది నీల. ఆ బొమ్మల్లోఉండే విరసమూ (Monotony) వాటిల్లోఉండే అసభ్యతా అసహ్యమూ, యీచిరుపాపల హృదయాల్ని ఎలానాశనం చేసేస్తాయో ఆవిడఎరగదు. పాపం పైపూతలకే లెక్కచేస్తూ లోపల హృదయమూ ఆత్మా నాశనం అయిపోతూ ఉన్నా సరకుగొనకుండా, వాళ్ల ఉత్సాహమంతా తప్పుదు దారిత్రొక్కుతూ ఉంటే కిలకిలానవ్వి గంతులువేసేస్తుంది ఆవిడ. తరువాత వాళ్ల హృదయాలు కఠినకర్కశ పాషాణాల్లాగు తయారైనప్పుడు లోకంతోపాటు విచారపడుతుంది!! అంతేకాని వాటికి కారణం ఏమిటో తెలిసికొంటుందా? అలాగే

భారతస్త్రీ ప్రవర్తిస్తే నానీ చెక్కిళ్లమీద ఎందుకు అలాకన్నీటిధారల చారలుంటాయి.

అసలు మాత కాబోయే ప్రతిస్త్రీ తానొక ఉత్తేజకారిణి దేవికావలసిన బాధ్యత తన శిరస్సుమీద ఉందని గ్రహించగలుగుతూఉందా? అది గ్రహించినట్లయిదే హృదయముతో మేధస్సుతో కూడుకున్న చిన్నారిపాపల్ని రాబోయే నూతన ప్రపంచాన్ని ఏదారి పైకితీసికొని రావాలో తెలుస్తుంది. మేధస్సుకు ఎంత ప్రాముఖ్యమిచ్చినా హృదయాన్ని మరిచిపోకుండా వాటి రెంటి సామరస్యానికే పాటుపడ్డాయి మన తక్షశిలానలందలు. మన అజంతా ఎల్లోరాలు అందుకే. మన సిద్ధాంతాల ప్రకారం ఆత్మకు మాతృస్థానం హృదయమే అయ్యింది. అన్నమయకోశంలో చెలరేగే ఉద్రేకాల్ని ఉద్భవమయ్యే విచిత్రశక్తుల్ని సరియైన పంథాలలో నడిపించి ఆనందానుభవమునకు మార్గాలుగా మార్చగలిగింది కళాప్రకృతి; అధోముఖియైన హృదయపద్మము వికసించి వికసించి ఊర్ధ్వముఖి అవ్వడమే ఈకళల ప్రయోజనం. అందుకనే మన పూరిగుడిసెలూ, దేముడిగుళ్లూ చివరకు బౌద్ధభిక్షువుల మఠములూ చిత్రవిచిత్రమైన ముగ్గులతో శిల్పకళలతో రంగురంగుల బొమ్మలతో కలకలలాడేవి. ఇది కారణంగానే జీవంతో కూడుకొన్న సుందరమయమైన బొమ్మలు మన ఇళ్లల్లోకి దారిచూచుకొనేవి. ఇలాటి సదాదర్శాలే మన యీ సంక్రాంతి పండుగకు బొమ్మలకు పూజచేయించేవి. మనం ఎన్నివిధాల వాళ్ల మేధస్సును వృద్ధిచేసినా హృదయం నాశనంచేసిన తర్వాత ఎందుకా మేధస్సు? వాళ్లను విపరీతమైన పరిస్థితులలో ఆత్మస్వాతంత్ర్యాన్ని నిగూఢసత్యాన్ని నాశనంచేసే పద్ధతులలో పెంచుతున్నాం. వాళ్లను సహృదయులు కమ్మంటే ఎలా వీలవుతుంది?

అందుకనే మన పూర్వీకులు భారత శిల్పాన్ని సత్యం సుందరం శివం అనిమూడు భాగాలుగా చేశారు. బాహ్యజగత్తుయొక్క అంతరమునను న్న నిత్యసత్యాన్ని తనభావ ప్రాబల్యముచే కనుగొని తన యిష్టమువచ్చినట్లు సుందరమయమైన ఆకృతిని ప్రసాదించి లోకాన్ని మారుస్తాడు భారతశిల్పి. అందుకనే ఆబొమ్మలకు హృదయంలో అంతస్థానం! ఈ జపానుబొమ్మలు యీ ఫేక్టరీగాజు ముక్కలు యీ క్యాలండరు స్త్రీల చిత్రాలు ఏసత్యాన్ని నిరూపించుతాయో ఆలోచించు? వాటికి సౌందర్యం ఏమిటి? అలాటివి హృదయాన్ని నాశనంచేసేసి మేధస్సును 'పోలీసువాళ్ల దెబ్బల్లాగ' లోలోపల ఎంత బాధిస్తాయో తెలిసేఉంటే నీల ఆవిధంగా పెట్టి ఉంటుందా? మన ఇళ్లమార్పుతో పిల్లలకు కావలసిన వాతావరణాన్ని నాశనం చేసేశాం. ఈ పాడు బొమ్మలతో వాళ్ల దృష్టిని హృదయాల్ని ఆత్మల్ని విధ్వంసం చేసేస్తున్నాం. ఈ బొమ్మలతోనే వాళ్ల ఆటలు; యీబొమ్మలే వాళ్లతల్లులుగా, పిల్లలుగా ఆదరింపబడతాయి; యీబొమ్మల్నే వాళ్లు కలలకన్నులతో జ్ఞాపకం తెచ్చు

కొనేది!!! ఇంకా ఏం కావాలి వాళ్ల బ్రతుకు మాడిపోవడానికి?

నానీ ఎన్నో విషయాలు చెప్పేదునీలకు ఆవిడిక్కడున్నప్పుడు. కాని ప్రయోజనం! నానీని మటుకు కళాభాయి అంటుంది, అంతే. అందుకనే అతనికంత విచారం. జీవంతో కల కలలాడే బొమ్మల్ని కొనమని ఎన్నో చెప్పేడట. చివరకు, రా జ యో గం అంటే ఏమిటీ అంటే ఇదేనన్నాడట. దాని ఫలితంఏమిటీ అంటే జీవంలేని గాజుపూసలు రంగు పూసిన చిన్న శవాలూ మననిత్య జీవితంలోకి దారిచూచుకోవడం దీనితో హృదయానికి మేధస్సుకు సామరశ్యము కుదురక లోతులేని తనము (Shallowness) మనపిల్లలకు అబ్బడం—ఇందంతా సరియైన దృష్టితో ఆలోచిస్తే ఆనాడు ఫొటోనుచూచి నానీ అన్నమాటలకు అర్థంకనబడకపోదు.

నానీవల్ల కొన్ని విషయాలు అర్థంచేసికొని అతనితో పాటు బాధపడడం నేర్చుకున్నాను నేను. కళకోసరం మన స్త్రీల మాతృత్వాన్ని కాపాడడం కోసరం రాబోయే నవయుగాన్ని సరియైన పంథాలో నడిపించడానికోసరం నీవుకూడా తెలిసికో యీవిషయాలు; యితరులకు తెలియచేయి. అంతేగాని నీలనీకు పేరుపెట్టినట్టు నాకు కూడా ఒక పేరు పెట్టి సంతృప్తి పరచవద్దు.

నీలకు కూడా ఈ విషయం తెలియచేస్తాను; తనుచేసే అన్యాయనికి పశ్చాత్తాపపడి సంస్కరించుకోమని వ్రాస్తాను.

నీసహాయాన్ని సదావాంఛించే,

"మణి."

# స్వాభిమానము

ఉ. ఆకలియున్న నెల్లరకు నర్థనిశీథినినైన రుచ్యమౌ
శాకము వంటకంబు లిడజాలెడిమానిని భార్య యుండగన్
వాకిటవాకిటన్నడుగ వచ్చెదుభిక్షము; ఆదయామయిన్
నాకొకయింతపెట్టుమనినంతనె పౌరుషహీనమయ్యెనే.

మ. తనుసేవించిన వారినెల్లర గృపార్ద్రదృష్టి వీక్షించి గాం
చనవృష్టిందనియించు భార్గవి యురస్థంబౌచునుండంగ వే
చని యాదానవు మూడుపాదములు భిక్షంబెత్తుకొన్నావు నీ
కనువే వేడగ రాదె నీసతిని ఏమాత్మాభిమానంబొకో?

చ. పరమమృదుస్వభావయు నపారకృపారస వారిధిక్షమా
భరిత యుదారశీలయగు భార్యవసుంధర చెంతనుండ నా
కరణి వనాంతరంబులను కాయలదింటివిగాని యావసుం
ధరనడుగంగ నీ పరువుదప్పునో శౌర్యము దూలిపోవునో.

గీ. ఆదిపురుషులరైన మీయంతవారె, స్వాభిమానమువిడకుండు జాడతెలసి
మఱచినారేమొ 'కరణేషుమంత్రి'యనెడి, మాట మగవార లాత్మాభిమానపరులు

గంటికృష్ణవేణమ్మ.